క్లుప్తంగా

ఘనంగా బంగారమ్మ జాతర


గ్రామవీధుల్లో అమ్మవారి ఘటం ఊరేగిస్తున్న దృశ్యం

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామంలో బంగారమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని, చేపట్టిన ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి ఘటాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, ఆలయ చైర్మన్ కర్రోతు పైడిరాజు, సచివాలయ కన్వీనర్ పతివాడ రామ్మకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలిపల్లిలో 'పశువిజ్ఞాన బడి'


పశువైద్యశాలలో రికార్డులు తనిఖీ చేసి, సూచనలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి విశ్వేశ్వరరావు

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎ.విశ్వేశ్వరరావు పాడిరైతులకు పశుసంవర్ధక శాఖ ద్వారా అందుతున్న పథకాలు, ప్రయోజనాలను వివరించారు. అంతకుముందు స్థానిక పశువైద్యశాలను సందర్శించి, అక్కడి సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించి, పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో పశువైద్యశాల ఏరియా సంచాలకులు ఉమాశంకర్ మహాపాత్రో, పోలిపల్లి పశువైద్యాధికారి కమలకుమారి, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆలుగు వెంకటరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మంగళవారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు వేతన సవరణ వెంటనే అమలుచేయాలని, ఏ మాత్రం జాప్యం లేకుండా బీఎస్ఎన్ఎల్ 4జీ, 5జీ సేవలు ప్రారంభించాలన్నారు. ఉద్యోగులకు కొత్త ప్రమోషన్ పాలసీని అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు జి.శివాజీరాజు, సహాయ కార్యదర్శి టి.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

- రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె.ఆర్.డి.ప్రసాద్


శిక్షణార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: ప్రథమ చికిత్సపై అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె.ఆర్.డి.ప్రసాద్ అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీలో మూడు రోజుల పాటు ప్రథమ చికిత్స నిర్వహణపై శిక్షణ ఇవ్వగా, ఈ శిక్షణలో ఉత్తీర్ణులైన శిక్షణార్థులకు ధ్రువపత్రాలు మంగళవారం అందజేశారు. పరిశ్రమలు, మాల్స్‌కు చెందిన వారికి ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్(ప్రథమ చికిత్స)పై శిక్షణ కావాలనుకుంటే రెడ్‌క్రాస్ సొసైటీని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సత్యం, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌ను సందర్శించిన డీఆర్‌డీఏ పీడీ


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి

విజయనగరం అర్బన్: స్థానిక టీటీడీసీ జిల్లా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన వైకేపీ, డీఆర్‌డీఏ సిబ్బంది వర్క్‌షాప్‌ను డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. గ్రామ సంఘాల సమగ్ర సమాచారం, సంఘం ద్వారా సంఘ సభ్యులకు అందుతున్న సేవలపై నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామ సంఘాల్లో చేయాల్సిన మానటరింగ్ మెకానిజం చెక్ లిస్ట్ తయారీ, ప్రతీ గ్రామ సంఘం పరిధిలో పరిశీలించాల్సిన అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏపీడీ కె.సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.


వేదికపై వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు, జెడ్పీ చైర్మన్


కొండవెలగాడ సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి


కొండవెలగాడలో పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

చైతన్యం ఉరిమి.. అభిమానం ఎగసి..

వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్ర జన జాతరను తలపించింది. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ యాత్ర ఆద్యంతం జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో హోరెత్తింది. తమ అభిమాన నాయకుడు జగనన్న అని, ఆయన వెంటే తామంతా అని జనం చేసే శబ్దాలు ముందస్తు విజయానికి సంకేతాలుగా నిలిచాయి. చాలా ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో బస్సులు, ఆటోలు, ట్రాక్టర్లలో జనం స్వచ్ఛందంగా తరలివచ్చి, జననేత జగనన్నపై తమకున్న అభిమానం చాటుకున్నారు.


బహిరంగ సభకు హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు

పూసపాటిరేగ: విజయనగరంలోని పూల్‌బాగ్ వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ప్రెస్‌మీట్ జరిగిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సామాజిక సాధికార యాత్ర ప్రారంభమైంది. డైట్ కళాశాల, కొండవెలగాడ, జరజాపుపేట మీదుగా నెల్లిమర్ల మొయిద కూడలి వైపు ఈ యాత్ర కొనసాగగా, మార్గమధ్యలోని కొండవెలగాడ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని మంత్రుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా మంత్రుల బృందానికి, బస్సుయాత్రకు వందలాది మంది పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం బైక్ ర్యాలీతో నెల్లిమర్ల మొయిద కూడలిలో జరిగే భారీ బహిరంగ సభకు చేరుకున్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగిన సభకు తండోపతండాలుగా జనం పోటెత్తారు. నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ సర్కారు చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని నేతలు వివరించారు. మరోసారి సీఎం జగనన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ నేపథ్యంలో తామంతా జగనన్న వెంటే ఉంటామన్న జనం చేసిన నినాదాలు మిన్నంటాయి. యాత్ర విజయవంతంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది. అంతకు ముందు సభా వేదికపై వంగపండు ఉష బృందం ఆటపాటలతో అలరించగా, ప్రజలు కూడా సరదాగా స్టెప్పులు వేసి, ఉత్సాహం కనబరిచారు.


ఆకట్టుకున్న పులివేషాలు


మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

సీఎం జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి


విజయనగరం రూరల్: ప్రభుత్వ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మళ్లీ సీఎం జగనే కావాలని, ఇదే కోరిక రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోరుకొండ గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయన తొలుత అక్కడి సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన ఈ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజల బాగోగులు ఆకాంక్షిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేకానేక సంస్కరణలు, సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం గ్రామాల్లోని సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇవే కాకుండా గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు మంజూరు చేశారన్నారు. వీటితో తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సౌకర్యాలు కల్పించడం జరుగుతోందన్నారు. జగనన్న హయాంలో ప్రతీ ఇంటికి మేలు జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయననే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, ఎంపీడీవో గంటా వెంకటరావు, గొల్లలపేట ఎంపీటీసీ రమణ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 10, 14, 22, 38వ డివిజన్లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ విజయనగరం అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ నేతలతో కలిసి తొలుత ప్రభుత్వ పథకాల బోర్డు, ఆ తర్వాత పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రజలకు ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం కావాలంటే మరోసారి సీఎం జగనన్నను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల కృష్ణారావు, ముద్దాడ మధు, కోలగట్ల తమన్న శెట్టి, వి.ఎస్.ప్రసాద్, కార్పొరేటర్లు సతీష్, సంధ్యారాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సిరి సహస్ర


చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్రతో సీతంనాయుడు దంపతులు

విజయనగరం రూరల్: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను), కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు ఎం.సిరి సహస్ర ఓ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి, మానవత్వం చాటుకున్నారు. మండలంలోని కొండకరకాం గ్రామానికి చెందిన బొద్దల సీతంనాయుడు కొన్నిరోజులుగా కేన్సర్‌తో బాధపడుతున్నాడు. ఇంటికి పెద్దదిక్కు అయిన ఆయనే మంచానికి పరిమితం కావడంతో ఆయన భార్య జయలక్ష్మి ఇద్దరు పిల్లలతో అతికష్టం మీద కుటుంబ భారం నెట్టుకురావడం తెలుసుకున్న సిరి సహస్ర ఆ దంపతుల కోరిక మేరకు ఓ చాట్, పానీపూరి బండి, అవసరమైన సామగ్రి వితరణ చేశారు. వారి జీవనోపాధికి సహకరించిన ఆమెకు ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కిలారి రాంబాబు, బోగాపురపు ఆదినారాయణ, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు


ఆర్‌బీకే సిబ్బందికి బయోమెట్రిక్ యంత్రాలు అందిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌బీకే సిబ్బంది, టీఏ, డీఈవోలకు ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మామిడి అప్పలనాయుడు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. దళారుల బారినపడి రైతులు మోసపోకుండా ప్రభుత్వం చేస్తున్న ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ధాన్యం నాణ్యత, మొలకశాతం, ట్రక్ షీట్లు జనరేట్ చేసే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గోనెసంచులు, రవాణా, హమాలీల చార్జీలు కూడా చెల్లించడం జరుగుతుందన్నారు. అనంతరం సిబ్బందికి బయోమెట్రిక్ యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.ఉమామహేశ్వరనాయుడు, సివిల్ సప్లయి సిబ్బంది పాల్గొన్నారు.

అనుబంధ కోర్సులే కీలకం

విజయనగరం అర్బన్: మెకానికల్ ఇంజినీరింగ్ విద్య ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు అనుబంధ కోర్సులే కీలకమని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రతినిధి కె.సద్గురునాథ్ అన్నారు. జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం(జీవీ) యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా స్టూడెంట్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో 'కెరియర్ ఆపర్చ్యూనిటీస్ ఫర్ మెకానికల్ ఇంజినీర్స్' అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి అనుబంధంగా ఆటోమొబైల్, మెకట్రోనిక్స్, రోబోటిక్స్ వంటి వినూత్న పరిశోధనలకు డిజైన్, మ్యానుఫ్యాక్చరింగ్, మెకానికల్ టెస్టింగ్ వంటివి కీలకంగా నిలుస్తాయన్నారు. అనంతరం ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి నీలిమాదేవి, ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు గంటల నిద్ర అవసరం

విజయనగరం: మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఏడు గంటల కనీస నిద్ర అవసరమని, దీంతో పాటు ఆరోగ్య నియమాలు పాటిస్తూ ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని చిన్న పిల్లల వైద్యనిపుణుడు ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం నగరంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన పేగు నిన్ను వేధిస్తోంది అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని కాసేపు మాట్లాడారు. రాత్రి 7 గంటల లోపు ఆహారం తీసుకోవాలని, 7 గంటల తర్వాత టీ, కాఫీ, పాలు, జ్యూస్ లాంటివి తీసుకోకూడదన్నారు. అలాగే ఉదయం పూట కూడా ఎక్కువగా ఇడ్లీ లేదా దోస లాంటి అల్పాహారం తీసుకుని, ఆకుకూరలు, ఫ్రూట్స్ తినాలన్నారు. ఫాస్ట్ ఫుడ్, నాన్‌వెజ్‌కు దూరంగా ఉండాలన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వ్యాయామం కూడా చేస్తే ఆరోగ్యం ఉండొచ్చని తెలిపారు.

వేతనాలు పెంచాలని డిమాండ్

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీలు(అంగన్‌వాడీ కార్యకర్త, అంగన్‌వాడీ ఆయా)కు వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకుడు పైడిరాజు డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలతో మంగళవారం నిరసనకు దిగిన ఆయన ఐసీడీఎస్‌కు బడ్జెట్, మెనూ చార్జీలు పెంచాలని కోరారు. అలాగే అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.5 లక్షలు, ఆయాకు రూ.3 లక్షలు చొప్పున ఇవ్వాలని, ఆ తర్వాత జీతంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకపోతే డిసెంబరు 1 నుంచి 5వ తేదీ వరకు నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతామని, డిసెంబరు 6వ తేదీన అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విశాలక్ష్మి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతీరావు పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ రక్తనిధి కేంద్రంలో గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్, ఎస్.కె. డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంపై ఉన్న అపోహలు వీడాలన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యమే తప్ప అనారోగ్యం లేదన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదిలో నాలుగు సార్లు రక్తం దానం చేయవచ్చన్నారు. మనమిచ్చే రక్తం మరొకరి ప్రాణాలు కాపాడుతుందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ప్రముఖ సంఘ సంస్కర్త జ్యోతీరావు పూలే జీవితం ఆదర్శవంతమైనదని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని, జీవించాలని కోరారు.

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పోటీల జట్టు ప్రకటన

విజయనగరం అర్బన్: చెన్నై అన్నామలై యూనివర్సిటీలో డిసెంబరు 1 నుంచి 4వ తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ యోగా పోటీలు(మహిళల విభాగం)కు సంబంధించి, జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం(జీవీ) జట్టును యూనివర్సిటీ ప్రకటించింది. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల రాజాం జీఎంఆర్ ఐటీ కళాశాలలో జరిగిన అంతర్ వర్సిటీ టోర్నీలో జీవీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచడంతో జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారిలో పి.కావ్య(లెండి కళాశాల), కె.లీలారమ్యశ్రీ(జీఎంఆర్ ఐటీ), ఎం.కావ్య(బాబా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్), డి.లావణ్య లహరి(జీఎంఆర్ ఐటీ, రాజాం), బి.హర్షిణి(లెండి కళాశాల) ఉన్నారు. ఎంపికైన జట్టు సభ్యులను వీసీతో పాటు రిజిస్ట్రార్ జి.జయసుమ తదితరులు అభినందించారు.

ఉపాధి హామీ పనులపై జేసీ ఆరా


ఉద్యానసాగు రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జేసీ(జాయింట్ కమిషనర్) ఎం.అశోక్‌కుమార్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరు, వేతనదారులకు అందుతున్న వేతనాలపై ఆరాతీశారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని తెలిపారు. అంతకుముందు గుణుపూరు, అమకాం గ్రామాల్లో పర్యటించిన ఆయన అక్కడి ఉద్యాన రైతులతో మాట్లాడి, ఉద్యాన పంటల సాగు, వాటి ద్వారా వచ్చే ఆదాయం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మణరావు, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీధర్, ఏపీఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో 'గురజాడ' సత్తా


పతకాలతో గురజాడ పాఠశాల విద్యార్థులు

విజయనగరం అర్బన్: టాటా బిల్డింగ్ ఇండియా సంస్థ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో నగరానికి చెందిన గురజాడ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్ కేటగిరీలో జరిగిన పోటీల్లో ఎస్.ఆశాభవాని, ఎ.యశ్వంత్, డింపుల్ వైష్ణవి వరుసగా గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. సీనియర్ విభాగంలో జరిగిన పోటీల్లో కె.ఓమ్నిక, జి.దేవిక, పి.సంజన్‌లు వరుసగా గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సొంతం చేసుకున్నారని ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్ మంగళవారం తెలిపారు.

వచ్చేనెల 17న భగవద్గీత కంఠస్థ పోటీలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీటీడీ ప్రోగ్రామ్ కన్వీనర్ శ్యామ్‌సుందర్, తదితరులు

విజయనగరం టౌన్: గీతా జయంతిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా శాఖ సంయుక్తంగా డిసెంబర్ 17న భగవద్గీత శ్లోక పఠన పోటీలు నిర్వహిస్తుందని టీటీడీ ప్రోగ్రామ్ కన్వీనర్ జె.శ్యామ్ సుందర్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను టీటీడీ ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. 6,7,8,9 తరగతి విద్యార్థులకు భగవద్గీతలో మూడో అధ్యాయం కర్మయోగంలో ఒకటి నుంచి 30వ శ్లోకం వరకు, 18 ఏళ్లు పైబడిన వారికి సంపూర్ణ భగవద్గీతలో 700 శ్లోకాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. నాలుగు విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. విజయనగరం జిల్లాలో టీటీడీ కళ్యాణ మండపంలోనూ, పార్వతీపురం మన్యం జిల్లాలో మార్కండపుట్టి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు సెల్: 94414 61076 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో తిరుపతిరావు, పి.వి.నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.